నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలి

కలెక్టర్ సత్యశారద

ఖిలావరంగల్, నవంబర్ 22: ఉపాధి హామీ పథకంలో నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని కలెక్టర్ సత్యశారద అధికారులకు సూచించారు. శుక్రవారం వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన విజయోత్సవం, ఇందిరా మహిళాశక్తి, ఉపాధి భరోసా, ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవంపై సమీక్ష జరిగింది. ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులు అవసరమైన చోటనే చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులను ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి గ్రామం గంగదేవిపల్లిగా రూపుదిద్దుకునేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీపీవో కల్పన, సీపీవో గోవిందరాజన్ పాల్గొన్నారు.

వరంగల్ కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాలి

మామునూరు ఎయిర్‌పోర్ట్, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, గ్రీన్ ఫీల్డ్, ఇన్నర్ రింగ్ రోడ్డు తదితర అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. శుక్రవారం రాత్రి వరంగల్ కలెక్టరేట్ వీసీ హాలులో అభివృద్ధి పనులపై సమీక్ష జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాను సందర్శించి వెళ్లిన తర్వాత వెలువడిన జీవోల ప్రకారం సంబంధిత అధికారులు ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్లు బండి నాగేశ్వర్‌రావు, ఎండీ ఇక్బాల్, రాజ్‌కుమార్, ఆర్ అండ్ బీ ఈఈ జితేందర్ రెడ్డి, ఇరిగేషన్ ఈఈ రామకృష్ణ పాల్గొన్నారు.

నేటి ప్రత్యేక ప్రజావాణి రద్దు

గిర్మాజీపేట, నవంబర్ 22: దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమం కోసం శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని పాలనాపరమైన కారణాలతో రద్దు చేస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి రాజమణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని దివ్యాంగులు, వయోవృద్ధులు గమనించి కలెక్టరేట్‌కు వినతులను ఇచ్చేందుకు రావద్దని కోరారు.

దరఖాస్తుల తుదిగడువు పెంపు

గిర్మాజీపేట, నవంబర్ 22: నేషనల్ అచీవ్‌మెంట్ స్కాలర్‌షిప్ కోసం ఫ్రెష్, రెన్యూవల్ దరఖాస్తుల తుది గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఈవో శ్రీధర్‌సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా దరఖాస్తు చేసుకోని ఇంటర్మీడియట్ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఓటరు నమోదుకు స్పెషల్ క్యాంపెయిన్

గీసుగొండ/ పర్వతగిరి, నవంబర్ 22 : ఈనెల 23, 24 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు, సవరణల కార్యక్రమం నిర్వహించనున్నట్లు గీసుకొండ తహసీల్దార్ రియాజుద్దీన్, పర్వతగిరి తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. బీఎల్‌వోలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు కొత్తగా ఓటరు నమోదుకు ఫాం-6, సవరణల కోసం ఫామ్-8, ఓటరు లిస్టు నుంచి తొలగించేందుకు ఫారం 7 నింపి బీఎల్‌వోలకు అందజేయాలన్నారు. అదే రోజు సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో ఫాంలను అందజేయాలని సూచించారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

నర్సంపేట, నవంబర్ 22: టాస్క్‌ఫోర్స్ పోలీసులు నర్సంపేటలో దాడి చేసి గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. నర్సంపేట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కృష్ణవేణి గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో వరంగల్‌లోని టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. రూ.28వేల విలువైన ప్యాకెట్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

BEFORE THE HONBLE TELANGANA STASTE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION AT: HYDERABAD

FA.No.426 of 2024

Between:
Kesari Adupa. ....Appellant
AND
Gurram Sathish. ....Respondent

NOTICE THROUGH PAPER PUBLICATION

TO:
GurramSathish, S/o Ramagoud, Hindu, Age: 46 years, Occ: Engineer, R/o 4-369/1, Beside Kits College, Yerragattugutta, Hasanparthy Mandal, Hanumakonda District– 506001

WHEREAS above named appellant filed above First Appeal against you. You are hereby noticed through publication to attend before the Hon'ble Telangana State Consumer Disputes Redressal Commission, Hyderabad on the day of 10-12-2024at 10-30 A.M. to defend aforesaid case and in default of your appearance on the day specified, Itwill be heard and determined in your absence.

(BY THE ORDER OF HON'BLE TSCDR COMMISSION)

Sd- **KESARI ADUPA**
PARTY IN PERSON
HANAMKONDA- DIST.
Date: 22-11-2024 .

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.

NT-338964-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పొన్నం రాజు

నర్సంపేట రూరల్, నవంబర్ 22: ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (మెపా) తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నర్సంపేట మండలం రాజపల్లికి చెందిన విద్యావేత్త, అధ్యాపకుడు పొన్నం రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు శుక్రవారం ఆయనకు నియామకపత్రాన్ని మెపా వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ అందించారు. మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొట్లపల్లి సంజీవన్‌కుమార్ ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శులు సింగారపు రామకృష్ణ, నీరటి రాజు, తాళ్ల రవీందర్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్మగారి శ్యామ్, కట్ల విజయ్, వినోద్, నరేష్, రాజు, రమేశ్, చిరంజీవి, కృష్ణ ఉన్నారు.

నియామక పత్రాన్ని అందజేస్తున్న దేవేందర్

బంగారు కమ్మలున్న బ్యాగు అపహరణ

గిర్మాజీపేట, నవంబర్ 23: బంగారు కమ్మలున్న హ్యాండ్‌బ్యాగు అపహరణకు గురైంది. ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ సీఐ ఎంఏ షుకూర్ తెలిపిన వివరాల ప్రకారం.. గీసుగొండ మండలం కోనాయమాకులకు చెందిన అమీనాబేగం అక్టోబర్ 5న వరంగల్ చౌరస్తాలోని బంగారుషాపునకు వెళ్లి తన విరిగిన బంగారుకమ్మలను అతికించుకొని హ్యాండ్‌బ్యాగ్‌లో వేసుకుంది. ఆటోలో వరంగల్ బస్టాండ్‌కు వెళ్లి తన ఇంటికి చేరుకుంది. రూ.65వేల విలువైన బంగారు కమ్మలున్న హ్యాండ్‌బ్యాగు ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో అపహరణకు గురైన విషయం గమనించలేదు. శుక్రవారం హ్యాండ్‌బ్యాగు ఇంట్లో వెతకగా కనిపించలేదు. ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో బ్యాగు చోరీకి గురైందని బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, వరంగల్ నగరంలోని మండిబజార్‌లో వసీం టిఫిన్ సెంటర్‌లో గురువారం రాత్రి 11గంటలకు కస్టమర్ లాడెళ్ల రాజేశ్ టిఫిన్ సెంటర్ వర్కర్లతో గొడవ పడ్డాడు. దీంతో ఒక్కసారిగా టిఫిన్ సెంటర్‌లోని ముగ్గురు వర్కర్లు మూకుమ్మడిగా రాజేశ్‌ను చితకబాదగా తలపై, గదమకు గాయాలయ్యాయి. దీంతో బాధితుడు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సబ్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీఎండీ

దుగ్గొండి, నవంబర్ 22: మండలంలోని రేఖంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం సీఎండీ వరుణ్‌రెడ్డి తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేసి సబ్‌స్టేషన్ ఆవరణలో ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్‌ల రికార్డుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీఈలు బీ అశోక్, కే కిషన్, రాజు చౌహన్, జీఎం శ్రీనివాస్, ఎస్‌ఈ మధుసూదన్, డీఈ తిరుపతి, ఏడీఈ ఏఈలు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

మొరం తవ్వకాలను అడ్డుకున్న వారిపై కేసు

సంగెం, నవంబర్ 22: ఎస్సారెస్పీ కాల్వ మట్టి తవ్వకాన్ని అడ్డుకున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఎల్.నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని షాపురం పరిధి ఎస్సారెస్పీ కాల్వ భూమిలో మైనింగ్ అనుమతులతో టెక్స్‌టైల్ పార్కులోని కీటెక్స్ కంపెనీకి మట్టిని తరలిస్తున్నారు. గ్రామానికి చెందిన పేరాల దిలీప్‌రావు, పేరాల సమ్మారావు, దొనికెల శ్రీనివాస్ తమ గ్రామ పరిధిలోని మట్టి ఎలా తరలిస్తున్నారని అడ్డుకున్నారు. దీంతో కారుణ్య కన్‌స్ట్రక్షన్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ అనుమాల వెంకటేశ్వర్లు అనుమతుల పత్రం చూపినప్పటికీ ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవడానికి మట్టి కావాలని దాన్ని తీసుకపోతే ఎలా అంటూ వాగ్వాదానికి దిగి దూషించారు. వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు ఈ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఖానాపురం/నెక్కొండ, నవంబర్ 22 : ఖానాపురం మండల కేంద్రంలోని హరితమిత్ర రైతు సంఘం, రైతుత్పత్తి సంఘం, బుధరావుపేట పద్మావతి రైతు ఉత్పత్తి సంఘం, ధర్మారావుపేట గణపతి, రంగాపురం హనుమాన్ రైతు ఉత్పత్తి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను శుక్రవారం నర్సంపేట మార్కెట్ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు ప్రారంభించారు. జగన్మోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు. నెక్కొండ మండలం చంద్రుగొండ, పెద్దకోర్పోల్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ హరీశ్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు.


ప్రారంభిస్తున్న రంజిత్‌రెడ్డి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సంగెం, నవంబర్ 22: మానసిక వ్యాధి తట్టుకోలేక పురుగులమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆశాలపల్లికి చెందిన మాడిషెట్టి రవికుమార్(47) పదేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతూ మందులు వాడుతున్నాడు. ఈనెల 16న సాయంత్రం వ్యవసాయబావి వద్దకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో బావి వద్దకు వెళ్లగా నోటి నుంచి నురగులు వస్తున్నాయి. కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు మాడిశెట్టి ఉదయ్‌కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు.


రవికుమార్(ఫైల్)

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

నెక్కొండ, నవంబర్ 22: మనస్తాపంతో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మూడుతండాలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన భూక్యా సుమన్ (21) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. ఇటీవల తన వివాహం, కుటుంబ విషయాల్లో మనస్తాపం చెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి చందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.


సుమన్(ఫైల్)

హిస్టారికల్ రన్ అండ్ రైడ్‌ను విజయవంతం చేయండి

కేఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి

వరంగల్ చౌరస్తా, నవంబర్ 22: ఆరోగ్య సూత్రాల్లో పరుగు, సైక్లింగ్ ప్రాముఖ్యతను తెలియజేయడానికి కేవీఎన్ఆర్ ఈవెంట్స్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టే హిస్టారికల్ రన్ అండ్ రైడ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కేఎంసీ ప్రిన్సిపల్ రాంకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఐఎంఏ హాల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మనిషి ఆరోగ్య సూత్రాల్లో మొదటిస్థానం పొందిన పరుగు, సైక్లింగ్‌పై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ 24వ తేదీ ఆదివారం ఉదయం 6గంటలకు కేఎంసీ నుంచి ఖిలావరంగల్ కోట ఖుష్‌మహల్ వరకు 3కేఎం, 5కేఎం, 10 కేఎం పరుగుపందెంతోపాటు సైక్లింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం హిస్టారికల్ రన్ అండ్ రైడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ మియా, తెలంగాణ వైద్యమండలి సభ్యులు నరేష్‌కుమార్, రితీష్, ప్రసన్న, శ్రీనాథ్, కేవీఎన్ఆర్ ఈవెంట్స్ నిర్వాహకుడు జయంత్, ప్రముఖ సైక్లింగ్ క్రీడాకారుడు నాగరాజు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేఎంసీ ప్రిన్సిపాల్, ఐఎంఏ ప్రతినిధులు

ఓ సిటీ మైదానంలో దివ్యాంగులకు క్రీడా పోటీలు

కాశీబుగ్గ, నవంబర్ 22: నగరంలోని కాశీబుగ్గ ఓ సిటీ ఇండోర్ స్టేడియంలో డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడా మహోత్సవం చేపట్టారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి రాజమణి జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. క్రీడా మహోత్సవంలో పాల్గొన్న దివ్యాంగులు జూనియర్స్, సీనియర్స్ వేర్వేరుగా అన్ని విభాగాల ఆటల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విజేతలను హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని పేర్కొన్నారు. జిల్లా స్థాయి క్రీడల్లో దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు తెలిపారు. విజేతలకు డిసెంబర్ 3న బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. సీడీపీఓలు దెబోరా, జూనియర్ అసిస్టెంట్ హేమలత, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ అనిరుద్, సూపర్‌వైజర్స్ కల్యాణి, కవిత పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో పాల్గొన్న దివ్యాంగులు

కార్తీక వన భోజనాలను విజయవంతం చేయాలి

ఖిలావరంగల్, నవంబర్ 22: ఖిలావరంగల్‌లోని ఏకశిల చిల్డ్రన్స్ పార్క్‌లో ఈ నెల 24న నిర్వహించే గౌడ కార్తీక వన భోజనాలను కులస్తులు విజయవంతం చేయాలని గోపా వరంగల్ జిల్లా అధ్యక్షుడు బైరి లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. శుక్రవారం ఖిలావరంగల్‌లోని చిల్డ్రన్స్ పార్క్‌ను పోపా, గౌడ సంఘం బాధ్యులు సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గౌడ కార్తీక వనభోజనాలకు పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్కతోపాటు గౌడ సంఘం రాష్ట్ర ప్రతినిధులు హాజరవుతారని, జిల్లాలోని గౌడ కులస్తులు వనభోజనాలకు హాజరుకావాలని కోరారు. గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరిగౌడ్, మండ వెంకన్న, తీగల శ్రీధర్‌గౌడ్, గొడిశాల సురాజ్, సూర్యనారాయణ, సత్యనారాయణ, నాగయ్య, లింగమూర్తి పాల్గొన్నారు.

ఖిలావరంగల్‌లోని ఏకశిల పార్క్‌ను పరిశీలిస్తున్న పోపా, గౌడ సంఘం ప్రతినిధులు

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

దుగ్గొండి, నవంబర్ 22: రాష్ట్రంలో ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలు, జీపీఎఫ్ లోన్స్, పార్ట్ ఫైనల్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర బిల్లులను వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం దుగ్గొండి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు ఎంఏ అజీజ్ ఉద్యోగ విరమణ జరిగింది. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు అజీజ్ ఎంతోమంది విద్యార్థులకు విద్యను బోధించారని అన్నారు. పీఆర్‌టీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గఫార్, తిరుపతిరెడ్డి, ఎంఈవో వెంకటేశ్వర్లు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పింగిలి శ్రీపాల్‌రెడ్డి

మార్కెట్‌లో మిషన్‌తో స్వీపింగ్

కాశీబుగ్గ, నవంబర్ 22: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో శుక్రవారం మహారాష్ట్రలోని పూనెకు చెందిన చాలెంజర్ స్వీపర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన స్వీపింగ్ మిషన్‌తో పారిశుద్ధ్య పనుల నిర్వహణ ట్రయల్ రన్ చేశారు. రైతులు, అడ్తి, కరీదు వ్యాపారులతోపాటు వివిధ కార్మిక వర్గాల వారు మార్కెట్ పరిధిలో పారిశుద్ధ్య పనులు అసంపూర్తిగా ఉంటున్నాయని అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి అభ్యర్థన మేరకు మార్కెట్ పరిధిలో స్వీపింగ్ మిషన్‌తో చేయించిన మార్కెటింగ్‌శాఖ అధికారులు పరిశీలించారు. త్వరలోనే స్వీపింగ్ మిషన్ ద్వారా పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని కార్యదర్శి పోలెపాక నిర్మల తెలిపారు. చాంబర్ ప్రతినిధులు, వివిధ వ్యాపార వర్గాలు, కార్మిక వర్గాలు పాల్గొన్నారు.

మార్కెట్ ఆవరణలో స్వీపింగ్ చేస్తున్న మిషన్

నేడు బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం

నర్సంపేట, నవంబర్ 22: పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జిలు, ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు నర్సంపేట పట్టణ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా నర్సంపేట మాజీ శాసన సభ్యుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

గీసుగొండ, నవంబర్ 22 : మండలంలోని ఎలుకుర్తి ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి యశ్వంత్ జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సతీశ్ తెలిపారు. ఈనెల 24వ తేదీన మెదక్ జిల్లా ముసాయిపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

వినతి పత్రం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

నర్సంపేట, నవంబర్ 22: బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని వరంగల్ బీసీ అడ్‌హక్ కమిటీ కన్వీనర్ గుంటి కిషన్ కోరారు. శుక్రవారం రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం చైర్మన్ బుసాని వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ బీసీల్లో అనేక వర్గాలు ఉండగా కొన్ని వర్గాలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించలేక వెనుకబడుతున్నారని, వారికి ప్రత్యేక కోటా వర్తింపజేయాలన్నారు. పలువురు బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

చెక్‌ముఖి టెస్ట్ విజేతలకు అభినందన

రాయపర్తి, నవంబర్ 22: మండలంలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు మండల స్థాయి చెక్‌ముఖి టాలెంట్ టెస్ట్‌లో విజేతలుగా నిలువగా శుక్రవారం ప్రిన్సిపాల్ సముద్రాల సరిత అభినందించారు. చెక్‌ముఖి టాలెంట్ టెస్ట్, సైన్స్ సంబురాల్లో గురుకులంలో పీ.ప్రసన్న (8వ తరగతి), బి.సాత్విక (9వతరగతి), వీ.లక్ష్మీప్రసన్న (10వ తరగతి) ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలువగా అభినందించారు. గురుకుల సిబ్బంది లీల, జ్యోతి, సృజన, కల్పన, కళమ్మ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు అందజేస్తున్న పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి

బాధిత కుటుంబాలకు 'పరుపాటి' చేయూత

రాయపర్తి, నవంబర్ 22: మండలంలో ఇటీవల మృతిచెందిన, పలు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి దవాఖానాల్లో చికిత్స పొంది ఇళ్లకు చేరుకున్న బాధితుల కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం పరామర్శించారు. తన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ నేతృత్వంలో బాధిత కుటుంబాలకు బియ్యం, వంట నూనెతోపాటు నిత్యావసర వస్తువులను అందజేసి ఆదుకున్నారు. మండలంలోని మైలారానికి చెందిన ఈర్ల కొమురమ్మ, పెర్కవేడులో గాయి సమ్మక్క, కంచర్ల రవీందర్, దూరిశెట్టి మల్లయ్య, మొరిపిరాలలో రాయారపు లచ్చుమ్మ, కాట్రపల్లిలో కందుకూరి లక్ష్మీ, కేశవాపురంలో జలగం పెద్ద సోమయ్య కుటుంబాలను పరామర్శించి చేయూతనందించారు. బీఆర్ఎస్ మండల నాయకులు రంగు కుమార్, పూస మధు, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, లేతాకుల మధూకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అమ్మిరెడ్డి, సంది దేవేందర్‌రెడ్డి, మహ్మద్ యూసఫ్, గజవెల్లి ప్రసాద్, గాదె రవీందర్‌రెడ్డి, గూడెల్లి వెంకటయ్య, పెరటి యాదవరెడ్డి, కోల సంపత్, గబ్బెట కొమురయ్య, ఎల్లస్వామి, భిక్షపతి పాల్గొన్నారు.

సీకేఎం కళాశాలలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, ఎన్‌సీసీ విద్యార్థులు

వ్యవసాయ కళాశాలలో ఎన్‌సీసీ డే వేడుకలు

కాశీబుగ్గ/పోచమ్మమైదాన్, నవంబర్ 22: నగరంలోని పైడిపల్లి వ్యవసాయ కళాశాలలో ఎన్‌సీసీ డే వేడుకలు నిర్వహించారు. ఎన్‌సీసీ అధికా సృజన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అసోసియేట్ డీన్ బలరామ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్ల సేవలు కొనియాడారు. కాగా, దేశాయిపేటలోని ప్రభుత్వ సీకేఎం కళాశాలలో శుక్రవారం ఎన్‌సీసీ డే సందర్భంగా మొక్కలు నాటారు. సీకేఎం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జి.శశిధర్‌రావు మాట్లాడారు. ఎన్‌సీసీలో చేరడం వల్ల నిస్వార్థసేవ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ధర్మారెడ్డి, వరప్రసాద్, లైబ్రేరియన్ అనిల్‌కుమార్, కెప్టెన్ పి.సతీష్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాశీబుగ్గ: మొక్కలు నాటుతున్న క్యాడెట్లు

జిల్లా సైన్స్‌ఫేర్‌ను విజయవంతం చేయాలి

గిర్మాజీపేట, నవంబర్ 22: జిల్లాలోని నర్సంపేట మండలం మహేశ్వరంలోని శివానీ పబ్లిక్ స్కూల్‌లో ఈనెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించే సైన్స్‌ఫేర్‌ను విద్యాశాఖ అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని డీఈవో జ్ఞానేశ్వర్ తెలిపారు. 26వ తేదీన సైన్స్‌ఫేర్‌లో పాల్గొనేందుకు రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులు, జిల్లాలో ఎంపిక చేసిన 148 ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్టులు ఉదయం 10 గంటలకల్లా శివానీ స్కూల్‌లో రిపోర్ట్ చేయాలన్నారు. మధ్యాహ్నం నుంచి 28వ తేదీ వరకు సందర్శకులకు అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు డీఎస్‌వో కట్ల శ్రీనివాస్‌ను 9848878455 నంబర్‌లో సంప్రదించాలని డీఈవో కోరారు.

మాదిగల ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలి

ఖానాపురం, నవంబర్ 22 : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత సాధనకు వచ్చేనెల 21న హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్‌దీప్, ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకుడు విజయ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం బుధరావుపేటలో ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తామని సీఎం అసెంబ్లీలో ప్రకటించారని, కానీ ఇప్పటివరకు అమలు చేయలేదని అన్నారు. వెంటనే అమలు చేయకపోతే రేవంత్ సర్కార్‌పై యుద్ధం ప్రకటిస్తామన్నారు. నారాయణ, కృష్ణ, నాగరాజు, యాకయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

భూ తగాదాలో ఇరువర్గాల ఘర్షణ

ఖానాపురం, నవంబర్ 22 : భూ తగాదాలో ఇరువర్గాలు ఘర్షణ పడిన ఘటన శుక్రవారం బుధరావుపేటలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామంలోని మోడల్‌స్కూల్ సమీపంలోని 37 ఎకరాలను 16 ఏళ్ల క్రితం కొందరు గ్రామస్తులు కొనుగోలు చేశారు. భూమి పంపకం విషయమై కొనుగోలుదారులు రెండువర్గాలుగా ఏర్పడగా కొన్నేళ్లుగా పంచాయతీ నడుస్తున్నది. ఈక్రమంలో శుక్రవారం రెండువర్గాలు మరోసారి ఘర్షణపడి దాడి చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు చేరుకుని ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఇరువర్గాల ఫిర్యాదులను స్వీకరించి విచారణ చేపట్టనున్నట్లు పోలీసులు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

గీసుగొండ, నవంబర్ 22 : నగరంలోని 16వ డివిజన్ ధర్మారం రైల్వేగేటు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వరంగల్ మండిబజార్‌కు చెందిన నీరటి రాధకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాధ తల్లి ఇటీవల ధర్మారంలో మృతిచెందగా ఆమె 5నెలల కార్యక్రమానికి వచ్చింది. తిరిగి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వరంగల్ నుంచి నర్సంపేట వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో ఆమె కిందపడిపోగా తీవ్ర గాయాలు కాగా, కాళ్లు, చేతులు విరిగిపోయాయి. 108లో ఎంజీఎం దవాఖానకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

హెడ్‌కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

ఖిలావరంగల్, నవంబర్ 22: ఓ హెడ్‌కానిస్టేబుల్ ఇంట్లో పట్టపగలే చోరీ ఘటన శుక్రవారం మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. మిల్స్‌కాలనీ సీఐ వెంకటరత్నం తెలిపిన కథనం ప్రకారం.. రంగశాయిపేట తెలంగాణ కాలనీలోని నివసిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రాము తన భార్యతో కలిసి శుక్రవారం ఉదయం 11.30 గంటలకు బయటకు వెళ్లి 2గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకున్నారు. బీరువా తెరిచి ఉండడంతో అనుమానం వచ్చి చూసే సరికి అందులోని నాలుగు తులాల బంగారు చంద్రహారం కనిపించలేదు. ఇంటి వెనుకాల దర్వాజ ద్వారా గుర్తుతెలియని వ్యక్తులు లోపలికి చొరబడి చంద్రహారం అపహరించినట్లు బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కేఎంసీకి పార్థివదేహం అప్పగింత

వరంగల్ చౌరస్తా, నవంబర్ 22: తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకతీయ మెడికల్ కళాశాలకు పార్థివదేహాన్ని అప్పగించారు. వరంగల్ రామన్నపేటకు చెందిన పాలా నారాయణ(89) అనారోగ్య సమస్యలతో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. కుటుంబసభ్యులు నేత్రాలతోపాటు వైద్య విద్యార్థుల పరిశీలన కోసం పార్థివదేహాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అందించేందుకు ముందుకువచ్చారు. కుటుంబసభ్యుల అనుమతులతో పార్థివదేహాన్ని ప్రత్యేక అంబులెన్స్‌లో కేఎంసీకి తరలించి ప్రిన్సిపాల్ రాంకుమార్‌రెడ్డి, అనాటమీ విభాగాధిపతి ప్రేమ్‌కుమార్, ప్రమోద్‌కు అందజేశారు. తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల అసోసియేషన్ అధ్యక్షుడు కొండ్రెడ్డి మల్లారెడ్డి, మృతుడి భార్య హైమావతి, నటేష్, రాకేష్, సురేష్, కూతురు సురేఖ పాల్గొన్నారు.

నారాయణ (ఫైల్)

మహిళను చేరదీసిన సఖీ కేంద్రం

నర్సంపేట, నవంబర్ 22: మతిస్థిమితం సరిగా లేని ఓ మహిళను వరంగల్ సఖీ కేంద్రం చేరదీసింది. సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ వల్లె శ్రీలత తెలిపిన వివరాలు ప్రకారం.. పట్టణంలో సంజీవ్‌నగర్ కాలనీకి చెందిన మద్దెల గోపమ్మ(29) తండ్రి గతంలో మరణించగా, తల్లి కొన్ని రోజుల క్రితం చనిపోయారు. గోపమ్మకు బాల్యంలోనే తలకు బలమైన గాయం కాగా మతిస్థిమితం కోల్పోయిందని, తోబుట్టువులు ఎవరూ లేకపోవడంతో స్థానికులు పాస్టర్ రూబెన్ సఖీ సెంటర్‌కు తెలుపగా, సఖీ నిర్వాహకులు ఎస్సై అరుణ్ సాయంతో గోపమ్మను సఖీ సెంటర్‌కు తరలించారు.

మణెమ్మను చేరదీస్తున్న 'సఖీ' నిర్వాహకులు

ఘనంగా పవిత్రోత్సవాలు ప్రారంభం

గీసుగొండ, నవంబర్ 22 : మండలంలోని కొమ్మాల శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో శుక్రవారం పవిత్రోత్సవాలు అర్చకుడు కాండూరి రామాచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం స్వామివారికి పవిత్ర ఆదివాసం, ఆరగింపు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. అర్చకులు విష్ణుచార్యులు, ఫణీంద్రాచార్యులు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న అర్చకులు

వరకట్న వేధింపులు చట్టవిరుద్ధం

గీసుగొండ, నవంబర్ 22 : వరకట్న వేధింపులు చట్టవిరుద్ధమని సర్వోదయ ట్రైనింగ్ కోర్డినేటర్ ఇందిరా అన్నారు. మండలంలోని కొమ్మాలలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలపై దాడులను అరికట్టేందుకు ప్రతి మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గృహహింస చట్టంతోపాటు లింగ వివక్షపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కోఆర్డినేటర్ అక్తర్‌పాషా, వీవోఏలు రాజు, సౌందర్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఇందిర